క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

కాగజ్‌నగర్‌టౌన్: కాగజ్‌నగర్ పట్టణ వ్యాప్తంగా శనివారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని కాగజ్‌నగర్ విద్యుత్ శాఖ ఏఈ కమలాకర్ తెలిపారు. 33/11 కేవీ సబ్ స్టేషన్‌లో నెలవారీ మరమ్మతుల కారణంగా ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు సుమారు ఐదు గంటల పాటు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు పేర్కొన్నారు. విద్యుత్ వినియోగదారులు గమనించి సహకరించాలని కోరారు.

సర్పంచ్ కుటుంబానికి పరామర్శ


పరామర్శిస్తున్న ఎమ్మెల్యే కోనప్ప

సిర్పూర్(టి): సిర్పూర్(టి) మేజరు గ్రామపంచాయతీ సర్పంచ్ తఫీమా పర్వీన్ తండ్రి అబ్దుల్ అమీన్ రెండు రోజుల క్రితం మృతి చెందగా శుక్రవారం సిర్పూర్(టి) ఎమ్మెల్యే కోనేరు కోనప్ప సర్పంచ్ తఫీమా పర్వీన్ కుటుంబ సభ్యులను పరామర్శించారు. కుటుంబ సభ్యులకు అండగా ఉంటానన్నారు. ఆయన వెంట మండల కోఆప్షన్ సభ్యుడు కిజర్‌హుస్సేన్, ఉపసర్పంచ్ తోట మహేష్, నాయకులు ఇఫాత్‌హుస్సేన్, ఆమేర్ తదితరులు ఉన్నారు.

అర్హులందరు ఓటు హక్కు కలిగి ఉండాలి


మాట్లాడుతున్న తహసీల్దార్ రియాజ్ అలీ

సిర్పూర్(టి): 18 సంవత్సరాలు నిండిన ప్రతీ ఒక్కరు ఓటుహక్కు కలిగి ఉండాలని తహసీల్దార్ రియాజ్ అలీ సూచించారు. శుక్రవారం మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో మండలంలోని వివిధ పార్టీ నాయకులకు ఓటు హక్కు, పలు అంశాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో ఓటు హక్కు లేని వారిని గుర్తించి ఓటు హక్కు పొందేలా చూడాలన్నారు. ఓటరు నమోదులో ఎలాంటి మార్పులు చేర్పులు ఉన్నా సవరించుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో వివిధ పార్టీ నాయకులు యాదగిరి బ్రహ్మయ్య, తోట మహేష్, అబ్దుల్ షకీల్, అబ్దుల్ అఖిల్, నర్గీవార్ రాజు తదితరులు పాల్గొన్నారు.

సమతా సైనిక్‌దళ్ కవాతు విజయవంతం చేయండి

వాంకిడి: ఈ నెల 14న మండల కేంద్రంలోని లక్ష్మీనగర్‌లో అంబేడ్కర్ విగ్రహావిష్కరణ కార్యక్రమాన్ని పురస్కరించుకుని సమతా సైనిక్ దళ్ ఆధ్వర్యంలో నిర్వహించే కవాతు (మార్చ్ ఫాస్ట్)ను విజయవంతం చేయాలని సమతా సైనిక్ దళ్ జిల్లా ఇన్‌చార్జి దుర్గం సందీప్ పిలుపునిచ్చారు. ఆదివారం ఉదయం 10 గంటలకు మండల కేంద్రంలో ఎస్ఎస్‌డీ ఆధ్వర్యంలో మార్చ్‌ఫాస్ట్ ఉంటుందన్నారు. జిల్లాలోని అంబేడ్కర్ అనుయాయులు, బౌద్ధ మహాసభ నాయకులు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

ప్రజల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

ఆసిఫాబాద్‌రూరల్: ప్రజల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని ఎంపీపీ మల్లికార్జున్ అన్నారు. శుక్రవారం మండలంలోని రహపల్లి నుంచి కొత్త రహపల్లికి వెళ్లే రహదారిలో రెండు కల్వర్టుల నిర్మాణానికి సర్పంచ్ శ్రీనివాస్‌తో కలిసి భూమిపూజ చేశారు. ఆయన మాట్లాడుతూ ప్రజల సౌకర్యం కోసం రహదారులు, కల్వర్టుల నిర్మాణం చేపడుతున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో నాయకులు పెంటు, మహేష్, రమేశ్, నగేష్ తదితరులు ఉన్నారు.

వాకర్స్ అసోసియేషన్ ఎన్నిక


నూతన వాకర్స్ అసోసియేషన్ కార్యవర్గం

రెబ్బెన: గోలేటి టౌన్‌షిప్‌లోని భీమన్న స్టేడియంలో శుక్రవారం వాకర్స్ అసోసియేషన్ గోలేటి కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కమిటీ గౌరవ అధ్యక్షుడిగా మల్రాజు శ్రీనివాస్‌రావు, అధ్యక్షుడిగా పత్తెం రాజాబాబు, ఉపాధ్యక్షులుగా కేసరి ఆంజనేయులు గౌడ్, మద్దెల సురేందర్ రాజు, డొబ్బల శ్రీనివాస్, గుల్బం చక్రపాణి, పోటు శ్రీధర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శిగా బోగే ఉపేందర్, కార్యదర్శులుగా కే.దేవయ్య, సమ్మయ్య, సుగ్రీవులు, మారం శ్రీనివాస్, జాడి మనోహర్, కోశాధికారిగా ఓడెలు, కార్యవర్గ సభ్యులుగా చిన్నయ్య, నారాయణ, సోమయ్య, కిషోర్, శ్రీనివాస్, రాజేష్‌లను ఎన్నుకున్నారు.

పొంచి ఉన్న కరెంట్ ముప్పు

- బూర్గుడలో ఇళ్లపై నుంచి విద్యుత్ తీగలు
- ఇనుప స్తంభాలు మార్చాలని గ్రామస్తుల డిమాండ్
- గతంలో పలు ప్రమాదాలు
- పట్టించుకోని అధికారులు


ఇళ్లపై నుంచి ప్రమాదకరంగా ఉన్న విద్యుత్ తీగలు

ఆసిఫాబాద్‌రూరల్: ప్రభుత్వం విద్యుత్ సమస్యల పరిష్కారానికి విద్యుత్ భద్రతా వారోత్సవాల పేరిట పలు కార్యక్రమాలు చేపట్టింది. ఇందులో భాగంగా గ్రామాల్లో నెలకొన్న కరెంట్ సమస్యల పరిష్కారానికి శ్రీకారం చుట్టింది. కాని ఇప్పటికీ అనేక గ్రామాల్లో సమస్యల పరిష్కారం జరగలేదు. వేలాడే కరెంట్ తీగల సవరణ, కొత్త స్తంభాల ఏర్పాటు, ట్రాన్స్‌ఫార్మర్ల చుట్టూ కంచె నిర్మాణం వంటి పనులు పూర్తి చేయడమే లక్ష్యంగా వారోత్సవాలు నిర్వహించినా ప్రయోజనం లేకుండా పోయింది. దీంతో విద్యుత్ సమస్యలతో ప్రజలు నానా తంటాలు పడుతున్నారు. చిన్నపాటి గాలి వీచినా కరెంట్ పోతుండడంతో ఇక్కట్లు తప్పడం లేదు.

వేలాడే కరెంట్ తీగలు..

మండలంలోని బూర్గుడ గ్రామ పంచాయతీలో పురాతన కాలంలో వేసిన ఇనుప స్తంభాలు 21 వరకు ఉన్నాయి. స్తంభాల మధ్య దూరం ఎక్కువగా ఉండడంతో కరెంట్ తీగలు ప్రమాదకరంగా వేలాడుతున్నాయి. వర్షాకాలంలో ఇనుప స్తంభాలకు ఎర్త్ వస్తుండడంతో పలు ప్రమాదాలు సైతం చోటుచేసుకుంటున్నాయి. ఎర్త్ రావడంతో కరెంట్ షాక్‌కు గురై మూగజీవాలు ప్రమాదాలకు గురయ్యాయి. సమస్యను సంబంధిత కరెంట్ అధికారులకు ఎన్నిసార్లు విన్నవించినా పట్టించుకోవడం లేదని గ్రామస్తులు వాపోతున్నారు. ఇనుప స్తంభాలకు సమీపంలో ఉన్న ఇళ్లకు చెందిన వారు ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని ఆందోళన చెందుతున్నారు. కొందరు ప్రమాదాలు జరగకుండా తీగలకు ప్లాస్టిక్ పైపులు అమర్చుతున్నారు. ఇప్పటికైనా అధికారులు చొరవ తీసుకుని ఇనుప స్తంభాలు తొలగించి, కొత్త సిమెంట్ స్తంభాలు ఏర్పాటు చేయాలని స్థానికులు కోరుతున్నారు.

ఒకే ఒక ట్రాన్స్‌ఫార్మర్

మండలంలోని మోతుగూడ గ్రామంలో వ్యవసాయ మోటర్లకు సంబంధించిన ట్రాన్స్‌ఫార్మర్ ఒకటే ఉంది. దీంతో లోడ్ ఎక్కువ పడి వ్యవసాయ మోటర్లు కాలిపోతున్నాయి. రైతులు సంబంధిత అధికారులకు ఎన్నోసార్లు సమస్య గురించి చెప్పినా పట్టించుకోవడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ట్రాన్స్‌ఫార్మర్ చుట్టూ కంచె లేకపోవడంతో పాటు ఆన్‌ఆఫ్ సౌకర్యం కూడా లేదు.

గాలి వస్తే కరెంట్ బంద్

మండలంలో చిన్నపాటి గాలి వీచినా స్తంభాల మధ్య ఉన్న లూప్‌వైర్లు ఒకదానికి ఒకటి కలిసిపోవడంతో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నారు. ఈ సమస్య ఎక్కువగా ఆసిఫాబాద్ సబ్‌స్టేషన్ పరిధిలోని గిరిజన గ్రామాలు మోవాడ్, చిర్రకుంట, పాడిబంట, కొసార, బెల్గాం, వావుదాంతో పాటు 30 గ్రామాలకు ఉంది. దీంతో ఆయా గ్రామాల ప్రజలు చిన్నపాటి గాలి వచ్చినా కరెంట్ కట్ చేస్తున్నారని వాపోతున్నారు.

భయాందోళన చెందుతున్నాం



మా ఇంటిపై నుంచి కరెంట్ వైర్లు ఉన్నాయి. చిన్నపాటి గాలి వీచినా కరెంట్ వైర్లు ఒకదానికి ఒకటి కలిసిపోయి షాట్ అవుతుంది. కరెంట్ వైర్ల కిందకు ఉండటంతో కర్ర సాయంతో ఎత్తుకు కట్టాం. కనీసం ఒక స్తంభమైనా ఏర్పాటు చేయాలి.

\- అడప వెంకటేష్, బూర్గుడ

సిమెంట్ పోల్స్ వేయాలి



మా ఇంటి పక్కనే ఇనుప స్తంభం ఉండటంతో వర్షాకాలంలో ఎర్త్ వస్తుంది. మా పిల్లలు ఆడుకునే సమయంలో ప్రమాదం జరిగే అవకాశం ఉంది. సంబంధిత అధికారులు చొరవ తీసుకుని సిమెంట్ స్తంభం ఏర్పాటు చేయాలి.

\- పూలగం నాగేష్, బూర్గుడ

అధికారులు పట్టించుకోవడం లేదు



గ్రామంలో ఇనుప స్తంభాలు 21 వరకు ఉన్నాయి. వీటితో తరుచూ కరెంట్ షాక్‌కు గురై మూగజీవాలు మృతి చెందుతున్నాయి. ఇంటిపై నుంచి ఉన్న విద్యుత్ తీగలతో ప్రమాదం పొంచి ఉంది. సంబంధిత కరెంట్ అధికారులకు ఎన్నిసార్లు చెప్పినా పట్టించుకోవడం లేదు.

\- మాధవి, సర్పంచ్, బూర్గుడ

పీహెచ్‌సీలో ఘనంగా నర్స్ డే


వేడుకలు నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

కౌటాల: మండల కేంద్రంలోని ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో శుక్రవారం అంతర్జాతీయ నర్స్ డే, ఫ్లోరెన్స్ నైటింగేల్ దినోత్సవం సందర్భంగా కేక్ కట్ చేసి వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యురాలు నవత మాట్లాడుతూ ప్రజలకు నిస్వార్థ సేవ చేసే అవకాశం వైద్య వృత్తిలోనే ఉంటుందన్నారు. ప్రజల ప్రాణాలు కాపాడటానికి నిబద్ధతో పని చేయాలన్నారు. ఆసుపత్రిలో నర్సుల పాత్ర ప్రధానమైనదని తెలిపారు. కౌటాలలో అధికంగా సాధారణ కాన్పులు చేయడంలో నర్సుల సేవలు మరువలేనివని పేర్కొన్నారు. కార్యక్రమలో హెల్త్ సూపర్‌వైజర్ పావని, స్టాఫ్ నర్సులు సునీత, సృజన, వర్ష, వైద్య సిబ్బంది అనిత, పెంటుబాయి, సవిత, తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ బస్సులు ఢీ


ఎదురెదురుగా ఢీకొన్న ఆర్టీసీ బస్సులు

రెబ్బెన(ఆసిఫాబాద్): రెండు బస్సులు ఎదురెదురుగా ఢీకొన్న సంఘటన మండల కేంద్రంలోని పుంజుమేర గూడ బస్టాండ్ సమీపంలో శుక్రవారం చోటుచేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం... రెబ్బెన వైపు నుంచి ఆసిఫాబాద్ వైపు వెళ్తున్న ఆర్టీసీ బస్సు మండల కేంద్రం దాటగానే ఒక్కసారిగా బ్రేకులు ఫెయిలయ్యాయి. దీంతో డ్రైవర్ వాహనాన్ని అదుపు చేసే క్రమంలో ఎదురుగా రెబ్బెన వైపు వస్తున్న మరో ఆర్టీసీ బస్సును ఢీకొట్టింది. రెండు బస్సుల్లోని ప్రయాణికులకు ఎలాంటి గాయాలు కాలేదు. ఈ విషయమై ఎస్సై భూమేష్‌ను వివరణ కోరగా ప్రమాదానికి సంబంధించిన ఫిర్యాదు అందలేదని తెలిపారు.

ఇంటింటా ఇళ్ల పట్టాల పంపిణీ

బెల్లంపల్లి: మున్సిపాలిటీ పరిధి 22 వార్డులో శుక్రవారం ఇంటింటా ఇళ్ల పట్టాల పంపిణీ జరిగింది. దరఖాస్తు చేసుకున్న పలువురి లబ్ధిదారుల ఇళ్లకు ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య స్వయంగా వెళ్లి ఇళ్ల పట్టాలు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఇంటికి పట్టా ఇచ్చి యాజమాన్యపు హక్కు కల్పించిన ఘనత సీఎం కేసీఆర్‌కే దక్కిందన్నారు. ఏళ్ల తరబడిగా ఎదురుచూస్తున్న ఇళ్ల పట్టాలతో పురప్రజలు ఇకపై స్వేచ్ఛాయుతంగా జీవించడానికి అవకాశం కలిగిందన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ జక్కుల శ్వేత, వార్డు కౌన్సిలర్ గడ్డం అశోక్ కార్యకర్తలు పాల్గొన్నారు.

నిబంధనలు బేఖాతరు..!

- మద్యం దుకాణాల్లో ఇష్టారాజ్యంగా అమ్మకాలు
- కాలపరిమితి ముగిసిన బీర్ల విక్రయం
- పట్టించుకోని ఎక్సైజ్ అధికారులు


బీరు సీసాలపై వివరాలు తొలగించిన దృశ్యం


రవీంద్రనగర్‌లో మూసిన మద్యం దుకాణం, పక్కన మరో గదిలో కొనసాగుతున్న బెల్టుషాపు

చింతలమానెపల్లి: మద్యం దుకాణదారులు నిబంధనలు ఉల్లంఘించి అక్రమాలకు పాల్పడుతున్నారు. అక్రమ సంపాదన కోసం ప్రజల ఆరోగ్యాలతో ఆటలాడుతూ కాలపరిమితి ముగిసిన మద్యాన్ని విక్రయిస్తున్నారు. ఇంత జరుగుతున్నా అబ్కారి శాఖ అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదు.

అక్రమార్జనకు అడ్డదారులు

మండలంలో రెండు మద్యం దుకాణాలను ప్రభుత్వం మంజూరు చేసింది. మండలంలోని రవీంద్రనగర్‌లో గతంలో ఒక దుకాణం ఉండగా అదనంగా గూడెంలో మరో మద్యం దుకాణం మంజూరైంది. రవీంద్రనగర్ మద్యం దుకాణంలో అక్రమ సంపాదన కోసం నిర్వాహకులు అడ్డదారులు తొక్కుతున్నారనే ఆరోపణలు విన్పిస్తున్నాయి. మండలం నుంచి నిత్యం మహారాష్ట్రకు మద్యం అక్రమంగా తరలిస్తున్నారని తెలుస్తోంది. అక్రమంగా అధిక ధరల కోసం ఆటోలు, ద్విచక్రవాహనాలలో మద్యాన్ని పొరుగు రాష్ట్రానికి తరలిస్తున్నారు.

అధిక ధరలకు..

మద్యం దుకాణాల నిర్వహణలో ఎలాంటి అవకతవకలు జరగకుండా ప్రభుత్వం కఠిన నిబంధనలు అమలు చేస్తోంది. కాని రవీంద్రనగర్ మద్యం దుకాణ నిర్వాహకులు మాత్రం నిబంధనలు పాటించడం లేదు. మద్యం దుకాణాన్ని ఉదయం 10 గంటల నుంచి రాత్రి 10గంటల వరకు నిర్వహించాల్సి ఉంటుంది. కాని మద్యం దుకాణాన్ని సాయంత్రమే మూసివేసి పక్కన ఉన్న పర్మిట్ రూంలో అధిక ధరలకు మద్యం విక్రయిస్తున్నారు. దీంతో మద్యం కొనుగోలు దారులు నిర్వాహకులపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

కాలపరిమితి ముగిసిన బీర్ల అమ్మకం..

మద్యం దుకాణంలోని మద్యం సీసాలపై సంబంధిత మద్యం వివరాలు ముద్రించి ఉంటాయి. మద్యం తయారు తేది, కాలపరిమితి ముగిసిన తేది, ధర, బ్యాచ్ నంబర్ ఇతర వివరాలు ఉంటాయి. కాగా ఈ మద్యం దుకాణం నుంచి సరఫరా అవుతున్న కింగ్‌ఫిషర్, ఆల్ట్రా మ్యాక్స్ వంటి బీరు సీసాలపై వివరాలను తొలగించారు. కాలపరిమితి ముగిసిన బీర్లు కావడంతోనే నిర్వాహకులు వివరాలు తొలగించారని మద్యం ప్రియులు ఆరోపిస్తున్నారు. కాల పరిమితి ముగిసిన బీర్లు తాగితే తీవ్రమైన అనారోగ్యం బారిన పడే అవకాశం ఉండడంతో మద్యం ప్రియులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. అక్రమ సంపాదన కోసం నిబంధనలు ఉల్లంఘిస్తూ, ప్రజల ఆరోగ్యాలతో చెలగాటమాడుతున్న మద్యం దుకాణంపై చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

వినియోగదారులతో దురుసు ప్రవర్తన

బీరు సీసాలపై తొలగించిన వివరాలపై నిర్వాహకులను ప్రశ్నిస్తే వినియోగదారులతో దురుసుగా ప్రవర్తిస్తున్నారని స్థానికులు పేర్కొంటున్నారు. నిబంధనలు పాటించని మద్యం దుకాణంపై ఫిర్యాదు చేసినా సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదని మద్యంప్రియులు వాపోతున్నారు.

కఠిన చర్యలు తీసుకుంటాం

మద్యం దుకాణాలు నిబంధనల ప్రకారం నిర్వహించాలి. నిర్ణయించిన సమయాల్లో తెరిచి ఉంచాలి. ఉల్లంఘిస్తే చర్యలు తప్పవు. రవీంద్రనగర్ మద్యం దుకాణంలో తనిఖీలు నిర్వహిస్తాం. ఇష్టారీతిగా విక్రయాలు జరిపితే కఠిన చర్యలు తీసుకుంటాం.

\- విలాస్, ఎక్సైజ్ సీఐ

పల్లెల్లో పడకేసిన పారిశుధ్యం

- సమ్మెలో జూనియర్ పంచాయతీ కార్యదర్శులు
- పట్టించుకునే వారు కరువు


సిద్దాపూర్‌లో పూడిక తీయకపోవడంతో అధ్వానంగా డ్రెయినేజీ

బెజ్జూర్: జూనియర్ పంచాయతీ కార్యదర్శులు సమ్మె చేస్తుండడంతో పట్టించుకునే వారు లేక పల్లెల్లో పారిశుధ్యం పడకేసింది. మండల కేంద్రంతో పాటు ఆయా గ్రామ పంచాయతీల కార్యదర్శులు 14 రోజులుగా తమ సమస్యల పరిష్కారం కోరుతూ సమ్మె బాట పట్టారు. ఈ నేపథ్యంలో మండల కేంద్రంతో పాటు 22 గ్రామపంచాయతీలలో సమస్యలు ఎక్కడికక్కడే తిష్టవేశాయి. కొన్ని గ్రామాలలో డ్రెయినేజీలు పూడిక తీయకపోవడంతో దుర్వాసన వెదజల్లుతోంది. కొన్ని చోట్ల వీధిదీపాలు వెలగకపోవడం, చెత్త సేకరించకపోవడం వంటి సమస్యలతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ఓవైపు వేసవి కావడం మరో వైపు గ్రామపంచాయతీలలో మిషన్ భగీరథ నీరు సరిగా సరఫరా కాకపోవడంతో ఎవరికి చెప్పుకోవాలో కూడా తెలియని పరిస్థితుల్లో బెజ్జూర్, ఎలుకపల్లి, చిన్న సిద్దాపూర్ ప్రజలు అల్లాడిపోతున్నారు. బర్త్, డెత్ సర్టిఫికెట్ల కోసం దరఖాస్తు చేసుకున్నవారు అధికారులు అందుబాటులో ఉండకపోవడంతో ఇబ్బందులు పడుతున్నారు.

దుర్వాసన వస్తోంది



డ్రెయినేజీ పూడిక తీయకపోవడంతో దుర్వాసన వస్తోంది. పంచాయతీ కార్యదర్శులు అందుబాటులో లేకపోవడంతో చాలా సమస్యలు రాజ్యమేలుతున్నాయి. దీంతో గ్రామీణ ప్రాంత ప్రజలు అనేక ఇబ్బందులు పడుతున్నారు. ఉన్నతాధికారులు చొరవ తీసుకుని సమస్యల పరిష్కారానికి ప్రత్యామ్నాయం చూడాలి.

\- బాలకృష్ణ, సిద్దాపూర్

విత్తనాల కొనుగోలులో జాగ్రత్తలు పాటించాలి

పెంచికల్‌పేట్: విత్తనాలు కొనుగోలు చేసే సమయంలో రైతులు జాగ్రత్తలు పాటించాలని ఏఈవో లావణ్య అన్నారు. శుక్రవారం మండలంలోని లోడ్‌పల్లి గ్రామంలో రైతులకు విత్తనాలు, ఆయిల్‌పామ్ మొక్కల పెంపకంపై అవగాహన కల్పించారు. మార్కెట్‌లో నకిలీ విత్తనాల బెడద ఎక్కువగా ఉందని, అప్రమత్తంగా లేకపోతే మోసపోయే ప్రమాదం ఉంటుందన్నారు. ఈ నేపథ్యంలో విత్తనాలు, ఎరువులపై అవగాహన పెంచుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని పేర్కొన్నారు. గుర్తు తెలియని వ్యక్తులు గ్రామాల్లో విత్తనాలు విక్రయిస్తే వ్యవసాయ అధికారులకు, పోలీసులకు సమాచారం ఇవ్వాలని తెలిపారు. లైసెన్స్ ఉన్న ఫెర్టిలైజర్స్ దుకాణాల్లో మాత్రమే రైతులు విత్తనాలు కొనుగోలు చేయాలని పేర్కొన్నారు. విత్తనాల ప్యాకెట్, సీడ్ బ్యాగ్‌పై కంపెనీ వివరాలతో పాటు బార్‌కోడ్, లైసెన్స్ నంబర్, కంపెనీ అడ్రస్ తదితర అంశాలను పరిశీలించాలన్నారు. అనంతరం ఆయిల్ పామ్ మొక్కల పెంపకం గురించి వివరించారు. ఉప సర్పంచ్ గుర్లె శ్రీనివాస్, రైతులు పాల్గొన్నారు.


రైతులకు అవగాహన కల్పిస్తున్న ఏఈవో లావణ్య

నకిలీ విత్తనాలు సాగు చేయొద్దు

చింతలమానెపల్లి: రైతులు నకిలీ విత్తనాలు సాగు చేయొద్దని ఏఈవో వెంకటేష్ అన్నారు. శుక్రవారం మండలంలోని బాబాసాగర్‌లో రైతులకు విత్తనాలు, ఆయిల్ పామ్ మొక్కల పెంపకంపై అవగాహన కల్పించారు. ఏఈవో మాట్లాడుతూ గుర్తు తెలియని వ్యక్తులు గ్రామాల్లోకి వచ్చి విత్తనాలు అమ్మితే వ్యవసాయ అధికారులకు, పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు. విత్తనాలను అధీకృత డీలర్ల వద్దనే కొనుగోలు చేయాలని సూచించారు. విత్తనాల ప్యాకెట్‌పై కంపెనీ వివరాలతో పాటు బార్‌కోడ్, లైసెన్స్ వివరాలను రైతులు పరిశీలించాలని పేర్కొన్నారు.

'కంటి వెలుగు' సద్వినియోగం చేసుకోవాలి

చింతలమానెపల్లి: తెలంగాణ ప్రభుత్వం ప్రజల ఆరోగ్యం కోసం ప్రవేశపెట్టిన కంటి వెలుగు వైద్య సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీపీ డుబ్బుల నానయ్య అన్నారు. శుక్రవారం మండలంలోని అడెపెల్లి గ్రామంలోని పంచాయతీ కార్యాలయంలో శుక్రవారం కంటివెలుగు శిబిరాన్ని ప్రారంభించారు. ఎంపీపీ మాట్లాడుతూ మండలంలోని అన్ని గ్రామాలలో కంటి వెలుగు కంటి వైద్య శిబిరాలను నిర్వహిస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో ఎంపీవో సుధాకర్ రెడ్డి, సర్పంచ్ అతికం సంతోష్ గౌడ్, కోఆప్షన్ సభ్యులు నాజిం హుస్సేన్, వైద్యాధికారి రవి పాల్గొన్నారు.


శిబిరాన్ని ప్రారంభిస్తున్న ఎంపీపీ

కౌటాలలో..

కౌటాల: కంటి వెలుగు శిబిరాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీపీ బసర్కార్ విశ్వనాథ్ అన్నారు. మండలంలోని గుడ్లబోరి గ్రామ పంచాయతీ కార్యాలయంలో శుక్రవారం కంటి వెలుగు శిబిరం ప్రారంభించారు. కార్యక్రమంలో సర్పంచ్ పాలే రాందాస్, ఎంపీటీసీ వసంత్‌రావ్, మాజీ ఎంపీపీ శ్రీనివాస్‌గౌడ్, వైద్యాధికారి అజ్మీర రాజ్‌కుమార్, నాయకులు బాజీరావ్, తదితరులు పాల్గొన్నారు.

బీజేపీలో చేరిన సర్పంచ్

బెజ్జూర్: మండలంలోని లంబాడిగూడ గ్రామానికి చెందిన బీఆర్ఎస్ సర్పంచ్ బెడికల శోభ పార్లమెంట్ మాజీ సభ్యుడు రాథోడ్ రమేశ్ సమక్షంలో బీజేపీలో చేరారు. శుక్రవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మాజీ ఎంపీ కండువా కప్పి సాదరంగా పార్టీలోకి ఆమెను ఆహ్వానించారు.


పార్టీలోకి ఆహ్వానిస్తున్న మాజీ ఎంపీ రమేశ్

అంబలి కేంద్రం ప్రారంభం

మంచిర్యాలరూరల్(హాజీపూర్): హాజీపూర్ మండల కేంద్రంలో పూస్కూరు ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత అంబలి పంపిణీ కేంద్రాన్ని తెలంగాణ ఫిలిం బోర్డు కార్పొరేషన్ మాజీ చైర్మన్ పూస్కూరు రామ్మోహన్‌రావు శుక్రవారం ప్రారంభించారు. వేసవిలో ప్రజల దాహార్తిని తీరుస్తూ వడదెబ్బకు తగలకుండా ఈ అంబలి ఆరోగ్యకరమైందని అన్నారు. రైతుబంధు మండల కన్వీనర్ పూస్కూరు శ్రీనివాసరావు, బీఆర్ఎస్ నాయకులు సంజయ్‌రావు, దొమ్మటి సత్తయ్య, బొడ్డు శంకర్, సింగతి మురళి, పూదరి శంకరయ్య, స్థానికులు పాల్గొన్నారు.

బాల్యమిత్రుడి కుటుంబానికి అండ

దండేపల్లి: తమతో కలిసి చదువుకుని అనారోగ్యంతో చనిపోయిన బాల్యమిత్రుడి కుటుంబానికి మిత్రులు అండగా నిలిచారు. మండలంలోని బిక్కనగూడకు చెందిన దశముకి రేణయ్య ఇటీవల అనారోగ్యంతో మృతిచెందాడు. దీంతో అతనితో ద్వారక జెడ్పీ ఉన్నత పాఠశాలలో చదువుకున్న 1993 ఎస్సెస్సీ బ్యాచ్ మిత్రులు అతని కుటుంబానికి రూ.15వేల ఆర్థికసాయం, 50 కిలోల బియ్యం, నిత్యావసర సరుకులను శుక్రవారం అందజేశారు. మిత్రులు రవి, రెడ్డి, చంద్రమౌళి, మూర్తి, గోపాల్, నృపేందర్, ప్రభాకర్, నర్సింగం, మల్లేశ్ తదితరులు పాల్గొన్నారు.

పండ్లు పంపిణీ

బెల్లంపల్లి: బెల్లంపల్లి మున్సిపల్ వైస్ చైర్మన్ బత్తుల సుదర్శన్ జన్మదినం పురస్కరించుకుని శుక్రవారం ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిలో సుదర్శన్ యూత్‌ఫోర్స్ ఆధ్వర్యంలో రోగులకు పండ్లు పంపిణీ చేశారు. పండ్లు, మజ్జిగ, బ్రెడ్ అందజేశారు.